నమస్తే తెలంగాణ
# నల్లగొండ
5 | నల్లగొండ, గురువారం 2 జనవరి 2025 | NALGONDA

# డబ్బుల పంపకాల్లో పంచాయితీ

• కానిస్టేబుల్, హోంగార్డు సస్పెన్షన్

పెన్‌పహాడ్, జనవరి 1 : డబ్బుల పంపకాల్లో ఓ కానిస్టేబుల్, హోంగార్డు మధ్య పంచాయితీ కావడంతో విషయం తెలిసి వారిని ఎస్పీ సస్పెండ్ చేశారు. పెన్‌పహాడ్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్ జాటోతు రవికుమార్, హోంగార్డు గంజి శ్రీను విధులు నిర్వహిస్తున్నారు. డిసెంబర్ 28న ఒక టీస్టాల్ వ్యక్తి నూతన సంవత్సరం సందర్భంగా దావత్ చేసుకోమని వీరిద్దరికి కలిపి రూ.1,500 ఇచ్చాడు.

ఆ డబ్బులను కానిస్టేబుల్ రవి మాత్రమే ఉంచుకొని హోంగార్డు శ్రీనుకు అందులో ఏ మాత్రం ఇవ్వక పోవడంతో హోంగార్డు శ్రీను కానిస్టేబుల్ రవితో ఘర్షణ పడ్డారు. పోలీస్‌స్టేషన్‌లో పట్టపగలే కొట్టు కోవడంతో విషయం తెలుసుకున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లు బుధవారం స్థానిక ఎస్‌ఐ గోపికృష్ణ తెలిపారు.



మాతారవింద ధ్యానమందిరంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ తదితరులు

# కొత్త భవిష్యత్‌ను నిర్ణయించుకొని ఆశాజనకంగా ముందుకు సాగాలి

• మాతారవిందల సందేశం సర్వ మానవాళికి ఆచరణీయం
• మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట టౌన్, జనవరి 1 : పాత వాటిని మదిలో నుంచి తీసివేసి, కొత్త భవిష్యత్తును నిర్ణయించుకొని కొత్త ఆలోచనలతో ఆశాజనకంగా ముందుకు వెళ్లాలని మాజీ మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. మాతారవిందల సందేశం సర్వ మానవాళికి ఆచరణీయమని తెలిపారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రం జమ్మిగడ్డలోని మాతారవింద కేంద్రంలో నిర్వహించిన సామూహిక ధ్యాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మాతారవింద కేంద్రంలో 40 సంవత్సరాలుగా ధ్యాన కార్యక్రమాన్ని విజయవంతంగా కొనసాగించడం అభినందనీయమన్నారు. మాతారవిందలు ఇచ్చిన సందేశం అందరికీ ఆచరణీయంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి, నిర్వాహకులు వెంకటరమణారెడ్డి, కొల్లు మధుసూదన్‌రావు, డాక్టర్ కరుణాకర్‌రెడ్డి, పర్వతం శ్రీధర్, గుండా జనార్దన్, మాజీ ఎమ్మెల్యే దోసపాటి గోపాల్, మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణతోపాటు వివిధ పార్టీల ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.








హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన న్యూ ఇయర్ వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు



నల్లగొండలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి



నకిరేకల్‌లో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

# నూతనోత్సాహం

• అంబరాన్నంటిన కొత్త సంవత్సరం వేడుకలు
• కేక్ కటింగ్‌లు.. స్వీట్ల పంపిణీ
• సోషల్ మీడియాలో వెల్లువెత్తిన శుభాకాంక్షలు

రామగిరి, జనవరి 1 : ఆంగ్ల నూతన సంవత్సరం 2025 సంబురాలు బుధవారం అంబరాన్నంటేలా సాగాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొత్త సంవత్సరాన్ని స్వాగతిస్తూ ఆనందోత్సాహంగా వేడుకలు జరుపుకొన్నారు. కేకులు కట్ చేసి, స్వీట్లు తినిపించుకొని ఒకరికొకరు ఆత్మీయంగా న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

కొత్త సంవత్సరంలో ఏడాదంతా మంచే జరుగాలని కోరుతూ జనం తమ ఇష్ట దైవాలను వేడుకొన్నారు. ఇక వాట్సాప్, ఫేస్‌బుక్ తదితర సోషల్ మీడియాలో స్నేహితులు, బంధువులకు కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ మెసేజ్‌లు, పోస్టులు వెల్లువెత్తాయి. కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ మహిళలు ఇంటి ముంగిళ్లను ముగ్గులు, రంగులతో అలంకరించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులను ప్రజలు, అభిమానులు కలిసి కొత్త సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు.



కోదాడలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు నయీమ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్



నల్లగొండ కలెక్టరేట్ వద్ద సంకెళ్లు వేసుకుని నిరసన వ్యక్తం చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

# సంకెళ్లతో సమగ్రశిక్ష ఉద్యోగుల నిరసన

రామగిరి, జనవరి 1: తమ సమస్యలు పరిష్కరించాలని, సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరుతూ సమగ్రశిక్ష ఉద్యోగులు కలెక్టరేట్ వద్ద చేపడుతున్న నిరవధిక సమ్మె బుధవారానికి 23వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఉద్యోగులు చేతులకు సంకెళ్లు వేసుకొని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా వెట్టి చాకిరీకి గురవుతున్నామని, తమ సర్వీసులను రెగ్యులర్ చేయాలని అన్నారు. దీక్షలకు టీయూపీఎస్‌తో పాటు పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు మద్దతు తెలిపారు. దీక్షలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మొలుగురి కృష్ణ, ప్రధాన కార్యదర్శి బొమ్మగాని రాజు, వివిధ హోదాల్లోని ఉద్యోగులు నీలాంబరి, సావిత్రి, గుమ్మల మంజుల, చాందపాక నాగరాజు, రాగిపాణి భిక్షమాచారి, లలిత, నాగయ్య, భిక్షం, పాండునాయక్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

# ఫలించిన పోలీస్ వ్యూహం

• ప్రశాంతంగా నూతన సంవత్సర వేడుకలు
• యాక్సిడెంట్ ఫ్రీ.. ఇన్సిడెంట్ ఫ్రీ నైట్‌గా డిసెంబర్ 31
• నల్లగొండ జిల్లాలో 246 డ్రంకెన్ డ్రైవ్ కేసులు



మంగళవారం అర్ధరాత్రి నల్లగొండ క్లాక్‌టవర్ సెంటర్‌లో పోలీస్ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నీలగిరి, జనవరి 1 : నల్లగొండ జిల్లాలో నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా సాగాయి. డిసెంబర్ 31 రాత్రి వేడుకల నేపథ్యంలో జిల్లా పోలీసులు అనుసరించిన వ్యూహం తో ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ చోటుచేసుకోలేదు. ఒక్క ప్రమాదమూ జరుగలేదు. జిల్లాకేంద్రంలో నాలుగు రోజులపాటు చేపట్టిన ఆపరేషన్ చబుత్రతో అంతా సవ్యంగా సాగింది. శాంతి భద్రతల విభాగం అధికారులతో పాటు ట్రాఫిక్ పోలీసులు మంగళవారం రాత్రి అంతా విధుల్లోనే ఉన్నారు. జిల్లావ్యాప్తంగా హైవేలు, పట్టణాల్లోని ప్రధాన రహదారులపై నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించారు. వేడుకలు జరుపుకొనే క్రమంలో ఎవరూ ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా చర్యలు తీసుకున్నారు. మద్యం తాగి వాహనం నడపడం, ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్‌కు ఎక్కడికక్కడ అడ్డుకట్ట వేశారు. గతంలో జరిగిన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ముందు జాగ్రత్తగా నల్లగొండ జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డు, దేవరకొండ రోడ్డు, ప్రకాశం బజార్‌లో వన్‌వే ఏర్పాటుచేశారు. ప్రధాన రహదారుల్లో బారికేడ్లు ఏర్పాటు చేసిన వాహనదారులు వేగానికి బ్రేక్ వేశారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్ స్వయంగా పట్టణంలోని తిరిగి పర్యవేక్షించారు. నల్లగొండ జిల్లాకేంద్రంలో 246 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కారు. వారిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. పట్టుబడిన వారిని గురువారం జిల్లా న్యాయస్థానం ముందు హాజరు పర్చనున్నారు. బుధవారం తెల్లవారుజామున 4 గంటల తర్వాత మాత్రమే సాధారణ ట్రాఫిక్ వ్యవస్థను కొనసాగించారు.

**పోలీసుల పని తీరు అభినందనీయం**

నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరుగకుండా పోలీసులు చేసిన ప్రయత్నం అభినందనీయం. ప్రజలు ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరుపుకొనేందుకు జిల్లా కేంద్రంలో మూడు రోజులుగా పోలీస్ యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకున్నది.

*- ఎస్పీ శరత్ చంద్ర పవార్*

**సూర్యాపేట జిల్లాలోనూ ప్రశాంతంగా వేడుకలు**

సూర్యాపేట టౌన్ : సూర్యాపేట జిల్లావ్యాప్తంగా నూతన సంవత్సరం సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుని సఫలమైనట్లు ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. ప్రమాదాల నివారణ, శాంతిభద్రతల పరిరక్షణకు మంగళవారం రాత్రి కట్టుదిట్టమైన భద్రత, పెట్రోలింగ్, డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలు, యువతను ముందస్తుగా అప్రమత్తం చేయడం కూడా కలిసి వచ్చిందన్నారు. డీజేలు, బాణసంచా, రోడ్డు భద్రత నియమాల ఉల్లంఘన, బహిరంగ మద్యపానం, రోడ్లపై కేక్ కటింగ్‌లు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ చోటుచేసుకోలేదని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# న్యూ ఇయర్ కిక్కు

• నల్లగొండ జిల్లాలో ఒక్కరోజే రూ.12 కోట్ల మద్యం తాగేశారు!

నల్లగొండ సిటీ, జనవరి 1 : నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నల్లగొండ జిల్లాలో మద్యం విక్రయాలు జోరుగా సాగాయి. డిసెంబరు 31 రాత్రి ఒక్క రోజే రూ.12 కోట్ల మద్యం అమ్మకాలు జరిగినట్లు ఎక్సైజ్ శాఖ లెక్కలు చెబుతున్నాయి. జిల్లాలో 155 వైన్స్‌తోపాటు బార్లు ఉండగా.. వైన్స్ అర్ధరాత్రి 12 గంటలు, బార్లు ఒంటి గంట వరకు తెరిచి ఉంచారు. మరోవైపు మాంసం విక్రయాలు కూడా పెద్దఎత్తున జరిగాయి. సాధారణ రోజుల్లో జిల్లాలో చికెన్, మటన్, చేపలు కలిపి నిత్యం రూ.50లక్షల మేర అమ్మకాలు ఉండగా, మంగళవారం దాదాపు రూ.కోటిన్నర వరకు జరిగి ఉంటాయన్నది అంచనా.



# రేపు ఎన్‌జీ కళాశాలలో జాబ్ మేళా

రామగిరి, జనవరి1: నల్లగొండలోని నాగార్జున ప్రభుత్వ కళాశాలలో ఈ నెల 3న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఉపేందర్, టీఎస్‌కేసీ కన్వీనర్ అనిల్‌కుమార్ బుధవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. 2024లో బీఎస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసిన, ప్రస్తుతం ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 9:30 గంటలకు కళాశాల అల్యూమినీహాల్లో హాజరు కావాలని కోరారు.

# పాతకక్షలతో వ్యక్తి దారుణ హత్య


చివ్వెంల, జనవరి 1: పాతకక్షలతో వ్యక్తిని దారుణంగా హతమార్చిన ఘటన మండలంలోని లక్ష్మీ నాయక్ తండాలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. లక్ష్మీనాయక్ తండాకు చెందిన ధరావత్ శేషు (35) వ్యవసాయం చేసుకుంటూ 108 అంబులెన్స్ ప్రైవేట్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం విధులు ముగించుకొని సూర్యాపేట నుంచి బైక్‌పై ఇంటికి బయల్దేరాడు. కాగా, తండాకు పక్కనే ఉన్న ఎస్సారెస్పీ కాల్వ వద్ద తన బాబాయి వెంకన్న కుమారుడు దీపక్, అతని స్నేహితులు ధరావత్ రాజేశ్, ధరావత్ సురేశ్, జర్పుల ప్రవీణ్ కూర్చొని మద్యం తాగుతుండడంతో వారి వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో పాతకక్షలను దృష్టిలో పెట్టుకొని శేషుతో దీపక్ గొడవకు దిగాడు. తన బైక్‌లో ఉన్న కత్తిని తీసి శేషును పొడిచాడు. దీనికి స్నేహితులు సహకరించారు. దీపక్ తన తండ్రి వెంకన్న, తల్లి సుజాతను పిలువగా శేషు భయంతో అక్కడి నుంచి పారిపోయి తండాలోని ధరావత్ రంగా ఇంటి వెనకాల ఉన్న గుడిసెలో దాచుకున్నాడు. అయినప్పటికీ అతడిని వెంబడించి కత్తితో గొంతు కోసి కడుపులో పొడిచారు. శేషు అరుపులు విన్న భార్య లలిత అక్కడకు వస్తుండడం గమనించిన దీపక్, వెంకన్న, సుజాత అక్కడి నుంచి పారిపోయారు. కాగా, శేషు మరో బాబాయి ధరావత్ శ్రీను ప్రోద్బలంతోనే హత్య చేశారని లలిత ఆరోపించింది. మృతుడు శేషు, అతని బాబాయిలు శ్రీను, వెంకన్న కుటుంబాల మధ్య 2017 నుంచి భూతగాదాలు ఉన్నట్లు దర్యాప్తులో తేలిందని రూరల్ సీఐ రాజశేఖర్ తెలిపారు. లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు. శేషుకు ఇద్దరు కుమారులు ఉన్నారు.

# కొత్త ఏడాదిలోనైనా పథకాలు అందేనా?



## ఆశగా ఎదురు చూస్తున్న లబ్ధిదారులు

- ఎన్నికల్లో హామీల మీద హామీలిచ్చిన కాంగ్రెస్
- ప్రజా పాలనలో దరఖాస్తుల స్వీకరణకే పరిమితం
- రైతు భరోసా పంపిణీపై కాలయాపన
- పత్తాలేని వృద్ధులు, దివ్యాంగుల పింఛన్ల పెంపు
- అందని ద్రాక్షగా ఆడబిడ్డలకు రూ.2,500..
- కల్యాణలక్ష్మిలో తులం బంగారం
- అమరులు, ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఏమాయె?
- యువ వికాసం కింద ఒక్క పైసా ఇయ్యలే..
- ఇందిరమ్మ ఇండ్లకు సాయంపై స్పష్టత కరువు



అసెంబ్లీ ఎన్నికల్లో అర చేతిలో వైకుంఠం చూపించిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక హామీలను అటకెక్కించింది. అధికార పగ్గాలు చేపట్టి ఏడాది దాటినా చెప్పిన స్కీమ్‌లను పట్టించుకోవడం లేదు. పూర్తి స్థాయిలో ఆరు గ్యారెంటీల తోపాటు కీలకమైన అనేక హామీలు అమలుకు నోచడం లేదు. కొత్త సంవత్సరంలోనైనా పథకాల అమలు చెయ్యాలని లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

*– యాదాద్రి భువనగిరి, జనవరి 1 (నమస్తే తెలంగాణ)*

అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ఎన్నికల్లో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఆ తర్వాత ఈ ప్రభుత్వంలోకి వచ్చాక ఆయా పథకాల కోసం దరఖాస్తులు తీసుకుంది. అందుకోసం గతేడాది డిసెంబర్ 28న ప్రజా పాలన కార్యక్రమం తీసుకొచ్చింది. జిల్లావ్యాప్తంగా పల్లెలు, పట్టణాల్లో దరఖాస్తులు స్వీకరించింది. మొత్తంగా 12.06 లక్షల అప్లికేషన్లు రాగా, ఇప్పటి వరకు పథకాలను మాత్రం అమలు చేయడం లేదు.


### ఆడబిడ్డలకు మొండిచెయ్యి

18ఏండ్లు పైబడిన మహిళలకు మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2,500, కళ్యాణ లక్ష్మి పథకంలో తులం బంగారం అందజేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. గత ఎన్నికల్లో రూ.2500 హామీ ఎంతో ప్రభావితం చేసింది. ఈ పథకానికి జిల్లాలో 2.32 లక్షల మంది ఆడబిడ్డలు దరఖాస్తు చేసుకున్నారు. కానీ ఇప్పటి వరకూ ప్రారంభించనే లేదు. కల్యాణ లక్ష్మి పథకంలో భాగంగా లక్ష రూపాయల సాయంతోపాటు తులం బంగారం వాగ్దానం చేసినా ఆ ప్రస్తావనే లేదు. కల్యాణ లక్ష్మి చెక్కులు కూడా పెండింగ్‌లోనే ఉన్నాయి.

### రైతులపై నిర్లక్ష్యం..

రైతు భరోసా పథకం కింద ప్రతి ఎకరాకు సీజన్‌కు రూ.7,500 చొప్పున ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఇది కౌలు రైతులకు కూడా వర్తిస్తుందని స్పష్టం చేసింది. అంతేగాక వ్యవసాయ కూలీలకు కూడా ఏడాదికి రూ.12 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చింది. కాగా, అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు బంధు పథకం పేరును రైతు భరోసాగా మార్చినా.. నగదు మాత్రం ఎకరాకు రూ.5 వేల చొప్పున మాత్రమే విడుదల చేసింది. అది కూడా ఒక్క సీజన్‌లోనే ఇచ్చింది. వానకాలం పంటకు పెట్టుబడి సాయం ఇవ్వలేదు. ఇప్పుడు యాసంగి సీజన్ నడుస్తున్నా.. ఏవో ముచ్చట్లు చెప్తూ కాలం వెల్లదీస్తున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రతి సీజన్‌లో 2.23 లక్షల మంది రైతుల ఖాతాల్లో రైతుబంధు డబ్బులు ఠంచనుగా పడేవి.

### పింఛన్ల పెంపు ఇంకెప్పుడు?



ఆరు గ్యారెంటీల్లో భాగంగా రూ.2 వేల పింఛన్‌ను రూ.4వేలకు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన మ్యానిఫెస్టోలో ప్రకటించింది. రూ.4వేలు ఉన్న దివ్యాంగుల పింఛన్ రూ.6వేలకు పెంచుతామని చెప్పింది. ఈ హామీలను 100 రోజుల్లోనే నెరవేరుస్తామని ప్రకటించింది. కానీ ఏడాది దాటినా పాత పింఛనే ఇస్తున్నది. యాదాద్రి భువనగిరి జిల్లాలో సుమారు 65వేల మంది పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు, చేనేత, గీతకార్మికులు, హెచ్‌ఐవీ, బోధకాల బాధితులు, డయాలసిస్ రోగులు పింఛన్ ఎప్పుడు పెంచుతారా అని ఎదురుచూస్తున్నారు.

### త్యాగాలకు గుర్తింపేది?

తెలంగాణ అమరుల కుటుంబాలకు 250 గజాల ఇంటి స్థలం హామీ కూడా అమలుకు నోచడం లేదు. జిల్లాలో ప్రజా పాలన సందర్భంగా 388 దరఖాస్తులు రాగా, వీటిని పరిగణలోకి కూడా తీసుకోవడం లేదు. ఉద్యమకారులకు సైతం 250 గజాల ఇంటి స్థలం ఇస్తామని చెప్పినా ఉలుకూ పలుకూ లేదు. దీని కింద జిల్లాలో 2,616 మంది ఉద్యమకారులు అప్లికేషన్ పెట్టుకున్నారు.

### ఇందిరమ్మ ఇండ్లు ఎన్నాళ్లకు?



అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్న కాంగ్రెస్.. తొలి విడుతలో సొంత స్థలం ఉన్న వారికి ఇండ్ల నిర్మాణం కోసం రూ.5 లక్షల సాయం చేస్తామని ప్రకటించింది. ఒక్కో నియోజకవర్గానికి 3,500 మంది లబ్ధిదారులకు ఇస్తామని చెప్పింది. జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల కోసం 2,01,977 దరఖాస్తులు వచ్చాయి. వారిలో అర్హులను గుర్తించేందుకు ప్రస్తుతం సర్వే నిర్వహిస్తున్నారు. ఇండ్ల స్థలాలకు సాయం ఎప్పుడు ఇస్తారనే దానిపై ఇప్పటికీ స్పష్టత లేదు.

### యువ వికాసానికి పైసా ఇవ్వలే..

అభయ హస్తంలో భాగంగా యువ వికాసం పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించింది. దీని కింద విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. క్రెడిట్, డెబిట్ కార్డు తరహాలో విద్యా భరోసా కార్డులో 5లక్షలు డిపాజిట్ చేస్తామని గప్పాలు కొట్టింది. కానీ ఇప్పటివరకు ఒక్క పైసా కూడా విడుదల చేసింది లేదు.

